క్లుప్తంగా

'పది' పరీక్షలకు ఏర్పాట్లు సిద్ధం

కాకుమాను: మండలంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎంఈఓ కేఎఫ్ కెనడీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం నుంచి రెండు కేంద్రాలలో పరీక్షలు ప్రారంభమవుతాయని తెలిపారు. కాకుమాను, చినలింగాయపాలెం ఉన్నత పాఠశాలలను పరీక్ష కేంద్రాలుగా ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. కాకుమాను కేంద్రంలో.. కాకుమాను, రేటూరు, పుసులూరు, కొమ్మూరు పాఠశాల విద్యార్థులు, చిన లింగాయపాలెం కేంద్రంలో చినలింగాయపాలెం, గరికపాడు, బోడిపాలెం పాఠశాలల విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని వెల్లడించారు. మొత్తం 304 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని పేర్కొన్నారు. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12: 45 గంటల వరకు పరీక్ష సమయంగా తెలిపారు. విద్యార్థులు గంట ముందుగా కేంద్రాలకు చేరుకోవాలని స్పష్టం చేశారు. వివిధ గ్రామాల నుంచి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల కోసం ప్రభుత్వం ఉచిత బస్సు సౌకర్యం కల్పించిందని, తమ హాల్ టిక్కెట్‌లను కండక్టర్‌కు చూపించి ఉచిత ప్రయాణం చేయవచ్చని ఎంఈఓ కెనడీ తెలిపారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్ష కిట్లు పంపిణీ

గుంటూరు ఎడ్యుకేషన్: పబ్లిక్ పరీక్షలకు హాజరు కానున్న పదో తరగతి విద్యార్థులకు ప్రభు ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం సంగడిగుంటలో ఎగ్జామ్ ప్యాడ్, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ బిషప్ రెబ్బా విక్టర్‌పాల్ మాట్లాడుతూ విద్యార్థి దశలో టెన్త్ దశ ఒక టర్నింగ్ పాయింట్ వంటిదని తెలిపారు. పరీక్షలు చక్కగా రాసి తల్లిదండ్రులతో పాటు విద్య నేర్పిన గురువులకు మంచి పేరు తేవాలని విద్యార్థులకు సూచించారు.

పీజీ సీట్ల మంజూరుపై సంబరాలు



గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాల, గుంటూరు జీజీహెచ్ జనరల్ సర్జరీ వైద్య విభాగంలో పీజీ సీట్లు 19 ఒకేసారి మంజూరవడంపై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి హర్షం వ్యక్తం చేశారు. శనివారం ఆసుపత్రి సూపరింటెండెంట్ కార్యాలయంలో జనరల్ సర్జరీ వైద్య విభాగాధిపతి డాక్టర్ పద్మశ్రీతో కలసి పలువురు వైద్యులు మిఠాయిలు పంపిణీ చేసి సంబరాలు జరిపారు. ప్రస్తుతం జనరల్ సర్జరీ వైద్య విభాగంలో పది పీజీ సీట్లు ఉండగా, 19 సీట్లు అదనంగా మంజూరు చేస్తూ ఎన్ఎంసీ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. జనరల్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ పద్మశ్రీ ఆధ్వర్యంలో ఎన్ఎంసీ (నేషనల్ మెడికల్ కమిషన్) తనిఖీల సమయంలో వైద్యులు అన్ని వసతులు ఏర్పాటు చేసి సీట్లు మంజూరయ్యేలా చేశారు. ఈ నేపథ్యంలో పలువురు జనరల్ సర్జరీ వైద్యులు జనరల్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ పద్మశ్రీకి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సంధ్యావళి, అడ్మినిస్ట్రేటర్ బి.ప్రవీణ్‌కుమార్, పలువురు సర్జరీ వైద్యులు పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్య

గుంటూరు రూరల్: తల్లి మందలించిందని యువతి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాసరావు వివరాల మేరకు.. గోరంట్ల గ్రామానికి చెందిన యర్రంశెట్టి పద్మావతి భర్తను వదిలి ఒంటరిగా జీవిస్తోంది. ఈ క్రమంలో ఆమె చిన్న కుమార్తె మానస చదువుకుని ఇంటి వద్దే ఉంటూ సమీపంలోని మోజెస్ అనే వ్యక్తిని ప్రేమించింది. రెండు రోజులుగా ఇంటి నుంచి వెళ్లిపోయి.. మోజెస్ ఇంటిలోనే ఉంటుంది. ఈ క్రమంలో తల్లి కుటుంబ సభ్యులు మోజెస్ ఇంటికి వెళ్లి.. వారితో మాట్లాడి శనివారం మానసను ఇంటికి తీసుకొచ్చారు. రాత్రి సమయంలో తల్లిని మానస ఫోన్ అడగగా ఇవ్వకపోగా.. మందలించింది.దీంతో మనస్తాపానికి గురైన మానస ఇంటి సమీపంలోని అపార్ట్‌మెంట్ ఎక్కి ఆత్మహత్యకు పాల్పడింది. ఘటన స్థలిలో తీవ్రగాయాలతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

భావి శాస్త్రవేత్తలను పాఠశాలలే తయారుచేయాలి

గుంటూరు ఎడ్యుకేషన్: భారతదేశాన్ని శాస్త్రీయంగా అభివృద్ధి పర్చే క్రమంలో భావి శాస్త్రవేత్తల్ని పాఠశాలలే తయారు చేయాలని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. శనివారం మల్లారెడ్డినగర్‌లోని సెంట్రల్ స్కూల్లో 23వ వైజ్ఞానిక ప్రదర్శన ముగింపు సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన విద్యార్థులు రూపొందించిన వైజ్ఞానిక ప్రాజెక్టులను తిలకించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న అంతర్గత నైపుణ్యాలు వెలికి తీసేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదం చేస్తాయన్నారు. వైజ్ఞానిక ప్రదర్శనలు శాస్త్ర, సాంకేతిక అంశాలపై విద్యార్థులకు ఆసక్తి కలిగేలా ప్రదర్శన ఏర్పాటు చేయడంలో పాఠశాలల యాజమాన్యాలతో పాటు తల్లిదండ్రులు ప్రోత్సహించాలని ఆయన సూచించారు. పాఠశాల డైరెక్టర్ ఎస్పీ రామచంద్రరావు మాట్లాడుతూ పిల్లల్లో నైపుణ్యాల్ని వెలికితీసేందుకు ఏటా వైజ్ఞానిక ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కాంపిటీషన్ సక్సెస్ కాలేజ్ డైరెక్టర్ ఎస్. రామన్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇన్నర్ రింగ్ రోడ్డు ఫేజ్-3 పనుల్లో.. ముందడుగు

- స్వర్ణభారతి నగర్‌లో రోడ్డు ప్రభావిత వాసులతో సమావేశం
- పాల్గొన్న ఎమ్మెల్యే మేకతోటి సుచరిత, కమిషనర్ చేకూరి కీర్తి
- బాధితులకు జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాలు..
- అందరికీ న్యాయం చేస్తామని భరోసా



స్వర్ణభారతి నగర్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే మేకతోటి సుచరిత, నగర కమిషనర్ చేకూరి కీర్తి

గుంటూరు రూరల్: గుంటూరు నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు ఇన్నర్ రింగ్ రోడ్డు చాలా కీలకమని, ఎంతో కాలం నుంచి పెండింగ్‌లో ఫేజ్ 3 పనులకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత కోరారు. శనివారం నగర మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చేకూరి కీర్తి, అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి ఇన్నర్ రింగ్ రోడ్డు ఫేజ్ 3లో భాగంగా ఇళ్లు కోల్పోతున్న బాధితులను కలిసి, వారి సమస్యలను ఆమె తెలుసుకున్నారు. వాటికి పరిష్కార మార్గాలు చూపారు. స్వర్ణభారతి నగర్‌లో పర్యటించి, స్థానిక కమ్యూనిటీ హాల్లో స్థానికులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుచరిత మాట్లాడారు. ఏళ్ల తరబడి కాల్వల వెంబడి, ప్రభుత్వ స్థలాల్లో అభద్రతా భావంతో జీవిస్తున్న వారికి ఇళ్ల పట్టాలు ఇచ్చి రాష్ట్ర ప్రభుత్వం భరోసా కల్పించిందన్నారు. స్వర్ణభారతి నగర్‌లో ఇన్నర్ రింగ్ రోడ్డు ప్రతిపాదిత ప్రాంతాల్లోని కొందరు బీ ఫారం ఉన్న వారు, ప్రభుత్వ స్థలాలను, కాల్వ కట్టలను ఆక్రమించుకొని ఇళ్ల నిర్మాణాలు చేపట్టినట్లు చెప్పారు. వారంతా రోడ్డు ఏర్పాటుకు సహకరించాలని కోరారు. నష్టపోతున్న వారికి జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాలు కేటాయించి, ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం నుంచి సహకారం అందిస్తామని తెలిపారు. చట్ట ప్రకారం ఆక్రమణలను తొలగించి పనులు చేపట్టే వీలున్నా, నగరపాలక సంస్థ అధికారులు కూడా రోడ్డు ఏర్పాటు వల్ల నష్ట పోయే ప్రతి ఒక్కరికీ న్యాయం చేసిన అనంతరమే పనులు ప్రారంభించాలని సూచించారు. బాధితులకు తగిన న్యాయం చేయడానికి నగరపాలక సంస్థ కౌన్సిల్‌లో తీర్మానం ద్వారా చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు ఎమ్మెల్యే సూచించారు. స్థానికులు మరో వారంలో జరిగే సమావేశం నాటికి తమ ఆమోద పత్రాలు ఇవ్వాలని కోరారు. రోడ్డు ఏర్పాటుపై ఎలాంటి అనుమానాలున్నా ప్రజా ప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. కమిషనర్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ ఇన్నర్ రింగ్‌రోడ్డు పనులు పూర్తయితే గుంటూరు నగరంలో ట్రాఫిక్ సమస్య తీరుతుందన్నారు. స్థానికులు పూర్తిగా సహకరించాలని కోరారు. 80 అడుగుల వెడల్పుతో 4.21 కిలోమీటర్ల మేర ఇన్నర్ రింగ్ రోడ్డు ఏర్పాటు జరుగుతుందన్నారు. అందులో ఇప్పటికే 3.30 కిలోమీటర్ల పనులు పూర్తయ్యాయని తెలిపారు. స్వర్ణభారతి నగర్ వద్ద పనులు ఆగిపోయాయన్నారు. ప్రస్తుతం ఉంటున్న వారికి చట్ట ప్రకారం భూమిపై హక్కులు లేవని, వారికి జగనన్న కాలనీల్లో పక్కా రిజిస్ట్రేషన్ తో ఇంటి స్థలం ఇవ్వడం జరుగుతుందన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు బి.స్మిత పద్మజ, వై.సాంబిరెడ్డి, ఆర్‌బీ డైరెక్టర్ పి.మేరి, ఎన్ఆర్‌జీఎస్ డైరెక్టర్ మనోహర్ రెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, డిప్యూటీ సిటీ ప్లానర్ మూర్తి, గుంటూరు పశ్చిమ తహసీల్దార్ సాంబ శివరావు, ఏసీబీ బాబురావు, టీపీఎస్ గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయుడి ఇంట్లో చోరీ



మంగళగిరి: నగర పరిధిలోని పెదవడ్లపూడిలో చోరీ ఘటన చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు విశ్రాంత ఉపాధ్యాయుడు బి నరసింహారావు తన కుటుంబంతో కలిసి మూడు రోజులు కిందట తమ కుమార్తె వద్దకు విజయవాడ వెళ్లారు. శనివారం రాత్రి ఇంటికి వచ్చేసరికి ఇంటి తలుపులతోపాటు బీరువా తాళాలు పగలకొట్టి అందులోని రూ.10 వేల నగదు, రూ.30 వేల విలువైన వెండి వస్తువులు, రూ.20 వేల విలువైన బంగారపు పోగులు మాయమైనట్లు గుర్తించి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

'చలో ఢిల్లీ'ని జయప్రదం చేయండి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.లక్ష్మణరావు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి లక్ష్మణరావు, కార్మికులు

ప్రత్తిపాడు: ఏప్రిల్ 5న జరగనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.లక్ష్మణరావు పిలుపునిచ్చారు. ప్రత్తిపాడులో శనివారం సాయంత్రం చలో ఢిల్లీ వాల్ పోస్టర్లను కార్మికులతో కలిసి సీఐటీయూ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ 2014ల ఎన్నికల ప్రచారం సమయంలో ప్రధాని నరేంద్ర మోది అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ధరలు తగ్గిస్తామని, నల్లధనాన్ని వెలికితీస్తామని చెప్పారన్నారు. కానీ ఆనాటి హామీలను అమలు చేయకపోగా, పేద, మధ్య తరగతి ప్రజలపై పెను భారం మోపడంతో పాటు, రైతు వ్యతిరేక నిర్ణయాలు తీసుకున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేఖ విధానాలకు నిరసనగా సీఐటీయూ, వ్యవసాయ, కార్మిక, రైతు, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో మద్దతు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రతి ఒక్కరూ చలో ఢిల్లీకి మద్దతు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు మధు, నాగరాజు, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు శ్రీనివాసరావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణ



అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార ప్రదర్శన

ప్రత్తిపాడు: చిరు ధాన్యాలతో ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్ వైజర్ అరుణ పేర్కొన్నారు. పోషణ పక్షోత్సవాలలో భాగంగా శనివారం గొట్టిపాడు సెక్టార్ పరిధిలోని పాతమల్లాయపాలెం అంగన్‌వాడీ సెంటరులో సూపర్ వైజర్ అరుణ ఆధ్వర్యంలో చిరు ధాన్యాలపై గర్భిణులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చిరు ధాన్యాలను తీసుకోవడం ద్వారా రక్తహీనతను అధిగమించవచ్చని సూపర్‌వైజర్ సూచించారు. పెరటి మొక్కలను పెంచడం ద్వారా రసాయన అవశేషాలు లేని తాజా కూరగాయలు పండించుకోవచ్చన్నారు. ఉపాధ్యాయుడు వెంకటరాయ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. ప్రత్తిపాడు సెక్టారు పరిధిలోని చినకోండ్రుపాడు గంగమ్మగుడి సెంటరు అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్ వైజర్ ఎంవీ రత్నం ఆధ్వర్యంలో పోషకాహార ప్రదర్శన నిర్వహించారు. తక్కువ ఖర్చుతో అధిక పోషక విలువలున్న ఆహారం తయారీని వివరించారు. సచివాలయం మహిళా సంరక్షణ కార్యదర్శి ప్రతిమ, అంగన్‌వాడీ కార్యకర్తలు జ్ఞాన సుందరి, నాగమణి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

వీవీఐటీ అధ్యాపకునికి డాక్టరేట్ ప్రదానం



అధ్యాపకుడికి డాక్టరేట్ ప్రదానం చేస్తున్న చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్

పెదకాకాని: వీవీఐటీ కళాశాలలోని ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగానికి చెందిన బొమ్మరాజు శ్రీనివాసరాజు విద్యుత్ పంపిణీ వ్యవస్థపై చేసిన పరిశోధనకు గాను జేఎన్టీయూ కాకినాడ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పొందినట్లు చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తెలిపారు. నంబూరు వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో శనివారం అభినందన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ కళాశాలకు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీనివాసరాజు విద్యుత్ సమతుల్య అసమాన పంపిణీ వ్యవస్థ పై పునర్నిర్మాణంపై విశ్లేషణాత్మక పరిశోధన పత్రాలను విశ్వవిద్యాలయం డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.శివనాగరాజు పర్యవేక్షణలో అందించినట్లు చెప్పారు. ఈ పరిశోధనకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు చెప్పారు. అనంతరం డాక్టర్ పొందిన బొమ్మరాజు శ్రీనివాసరాజును చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, వైస్ చైర్మన్ వాసిరెడ్డి మహదేవ్, ప్రిన్సిపల్ డాక్టర్ వై మల్లికార్జునరెడ్డి, డీన్ ఆఫ్ అకడమిక్ డాక్టర్ కె.గిరిబాబు, డీన్ ఆఫ్ అడ్మిన్ ఎస్.కుమార్ స్వామి, ఈ ఈ విభాగాధిపతి డాక్టర్ బాబు అభినందించారు.

సమన్వయంతో లక్ష్యాలను చేరుకోవాలి



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో అన్నపూర్ణ, వైద్యాధికారి డాక్టర్ కెజియాగ్రేస్

పెదగొట్టిపాడు (ప్రత్తిపాడు): విధి నిర్వహణలో ఇగోలకు వెళ్లడం సరికాదని డిప్యూటీ డీఎం అండ్ హెచ్ఓ అన్నపూర్ణ అన్నారు. ఏప్రిల్ 6 నుంచి ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తున్న సందర్భంగా గొట్టిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం ఆమె వైద్యాధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తించాలని సూచించారు. కొందరు ఆశ కార్యకర్తలు తమ సమస్యలను డిప్యూటీ డీఎం అండ్ హెచ్ఓ దృష్టికి తీసుకొచ్చారు. ఫ్యామిలీ ఫిజీషియన్ సమయంలో గ్రామానికి 104 వాహనం వచ్చినప్పుడు, వాహనం నుంచి మందుల బాక్సులు కిందకు దించాలని చెబుతున్నారని, తామెందుకు ఆ పని చేయాలని, తమ డ్యూటీ కాదని చెప్పారు. వారు మాత్రమే మందుల బాక్సులు కిందకు దించడం లేదని, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు కూడా తలో చేయి వేస్తున్నారంటూ మిగిలిన సిబ్బంది అన్నపూర్ణకు వివరించారు. దీంతో సానుకూలంగా స్పందించిన ఆమె ఇగోలకు పోతే కుదరదన్నారు. అందరూ కలిసి విధులు నిర్వర్తించినప్పుడే ప్రభుత్వ లక్ష్యాలను చేరుకోవడం సాధ్యపడుతుందన్నారు. వైద్యాధికారి డాక్టర్ కెజియాగ్రేస్, సూపర్ వైజర్ నిర్మల పాల్గొన్నారు.

అవసాన దశలో తల్లిదండ్రులకు అండగా ఉండాలి

ఉద్యోగాలు సాధించిన విద్యార్థుల తల్లిదండ్రులకు సన్మానం



విద్యార్థులను, తల్లిదండ్రులను సన్మానిస్తున్న ఇమ్మాన్యుయల్, లావు శ్రీకృష్ణదేవరాయులు

చేబ్రోలు: తల్లిదండ్రులు అవసాన దశలో పిల్లలు అండగా ఉండాలని హైదరాబాద్‌లోని ఈపీఏఎం సిస్టమ్స్ సీనియర్ రీసోర్స్ డెవలప్‌మెంట్ మేనేజర్ ఇమ్మాన్యుయల్ గోసుల పేర్కొన్నారు. వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో ఈ ఏడాది ప్రాంగణ ఎంపికల ద్వారా ఉద్యోగాలు సాధించిన 1,429 మంది విద్యార్థులను, వారి తల్లిదండ్రులను శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఇమ్మాన్యుయల్ గోసుల మాట్లాడుతూ విద్యార్థులు ఎప్పటికప్పుడు కొత్త విషయాలు నేర్చుకుంటూ.. స్కిల్స్ అప్‌డేట్ చేసుకోవాలన్నారు. హైదరాబాద్‌లోని హిటాచి వంటారా, టాలెంట్ అక్విసేషన్ మేనేజర్ ప్రశాంత్ నిడమర్తి మాట్లాడారు. సాఫ్ట్‌వేర్ రంగంలో మాంద్యం వచ్చిందని ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. మాంద్యంలో కూడా అవకాశాలను అందిపుచ్చుకున్న వారే అసలైన విజేతలన్నారు. విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ లావు రత్తయ్య మాట్లాడుతూ విద్యార్థుల్లో నాయకత్వ స్ఫూర్తి, సృజనాత్మకత, నైపుణ్యాలు పెంపొందించడం కోసం ప్రత్యేక శిక్షణలు ఇస్తున్నట్లు తెలిపారు. విజ్ఞాన్ విద్యా సంస్థల వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయులు వీసీ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్ పాల్గొన్నారు.

రహదారి భద్రతతో ప్రమాదాల నుంచి రక్షణ



సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి రత్నకుమార్, పక్కన జీవరత్నం,డీటీసీ కరీం

పట్నంబజారు: డ్రైవింగ్ చేసే ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా లీగల్ సెల్ సెక్రటరీ కలపాల రత్నకుమార్ చెప్పారు. స్వర్ణభారతీనగర్‌లోని ఆర్టీవో కార్యాలయంలో శనివారం లారీ, స్కూల్ బస్సు, ఆటో డ్రైవర్లకు రహదారి భద్రతలపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారుఉ. సదస్సుకు డీటీసీ షేక్ కరీం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి రత్నకుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్క డ్రైవర్ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. చిన్న చిన్న తప్పిదాలతో ప్రమాదాలు జరిగి పలువురు మృత్యువాత పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనుకోకుండా ప్రమాదం జరిగితే డ్రైవర్‌తో పాటు ప్రయాణికులకు కూడా బీమా వర్తిస్తుందని తెలిపారు. మోటారు వెహికల్ యాక్ట్‌కు సంబంధించి సుప్రీం కోర్టు, హైకోర్టు జారీ చేసిన చట్టాలపై అవగాహన కల్పించారు. లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ చీఫ్ జీవరత్నం మాట్లాడుతూ మైనర్ల ర్యాష్ డ్రైవ్ వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపేవారు అధికమయ్యారని, పలువురు ట్రిపుల్ డ్రైవ్ చేస్తూ ప్రమాదాలకు గురవుతున్నారని పేర్కొన్నారు. లైసెన్స్ వచ్చిన తర్వాతే పిల్లల చేతికి వాహనం ఇవ్వాలని సూచించారు. నియమ, నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలు అరికట్టవచ్చని తెలిపారు. డీటీసీ కరీం మాట్లాడుతూ పూర్తిస్థాయిలో ప్రతి వాహన డ్రైవర్ నిబంధనలు పాటించాలన్నారు. ఎప్పటికప్పుడు రోడ్డు భద్రతకు సంబంధించి నిబంధనలు పాటించనివారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. రహదారి భద్రతకు సంబంధించి డ్రైవర్లతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంవీఐలు గోపాల్, సౌజన్య, ఉషాకిరణ్ పాల్గొన్నారు.

సినిమా రంగం అందరిదీ అయినప్పుడే పరిపూర్ణత

- వీసీ ఆచార్య పి. రాజశేఖర్
- సినిమా- సామాజిక ఔచిత్యంపై నేషనల్ వర్క్‌షాప్ ప్రారంభం



సినీ దర్శకుడు గిరీష్ కాసరవల్లిని సన్మానిస్తున్న వీసీ రాజశేఖర్

ఏఎన్‌యూ: సినిమా రంగం సమాజంలోని అన్ని వర్గాలది అయినప్పుడే పరిపూర్ణత చోటు చేసుకుంటుందని వీసీ ఆచార్య పి. రాజశేఖర్ తెలిపారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ విభాగం ఆధ్వర్యంలో 'సినిమా–సామాజిక ఔచిత్యం' అనే అంశంపై మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న నేషనల్ వర్క్‌షాప్‌ను శనివారం వీసీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ కోట్లాది రూపాయలు వెచ్చించి భారీ వ్యయంతో చిత్రాలు నిర్మిస్తుండటం వల్ల ప్రతిభ ఉన్న యువత సినిమారంగంలో అడుగు పెట్టలేకపోతున్నారన్నారు. భారత్ వంటి దేశాలలో అంత ఖర్చు చేసి సినిమాలు నిర్మించాల్సిన అవసరం ఉందా అనేది ప్రశ్నించుకోవాలన్నారు. సినిమా అంటే వినోదం మాత్రమే కాదని, విజ్ఞానం, సంస్కృతి, వివక్షతలను తొలగించేదని పేర్కొన్నారు. ప్రపంచంలో ఏ సంస్కృతి ఆధిపత్యం ఉన్నా అన్ని వర్గాల మనుసులు గెలుచుకునే సామాజిక ఔచిత్యాన్ని సినిమారంగం ఎప్పటికీ అనుసరించాలని సూచించారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత, సినీ దర్శకుడు గిరీష్ కాసరవెల్లి ప్రసంగిస్తూ చాలా సినిమాలలో ప్రారంభంలో సామాజిక, సాంస్కృతిక కోణం ఉన్నప్పటికీ వాటి ముగింపు ఆ కోణంలో ఉండటం లేదన్నారు. దీంతో ప్రేక్షకులకు ఆ సినిమా తమకు అవసరమైన కోణంలో అర్థం చేసుకోలేకపోతున్నారని తెలిపారు. సమాజంలో ఉన్న అనేక సమస్యలకు పరిష్కారం చూపేందుకు సినిమా మంచి వేదిక అన్నారు. సదస్సు డైరెక్టర్ డాక్టర్ జె. మధుబాబు సదస్సు నిర్వహణ ఉద్దేశాన్ని వివరించారు. సినీ దర్శకులు సి. ఉమామహేశ్వరరావు, న్యూఢిల్లీ జామియా యూనివర్సిటీ అధ్యాపకుడు డాక్టర్ కృష్ణ శంకర్, కేరళ సెంట్రల్ యూనివర్సిటీ అధ్యాపకుడు డాక్టర్ వెల్లక్కీల్ రాఘవన్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సీహెచ్. స్వరూపరాణి, ఆర్కిటెక్చర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య శ్రీనివాసరెడ్డి, జర్నలిజం విభాగాధిపతి డాక్టర్ జి. అనిత ప్రసంగించారు. సినీ విశ్లేషకులు డాక్టర్ రెంటాల జయదేవ, పలువురు సినీరంగ ప్రతినిధులు, యూనివర్సిటీ అధికారులు పాల్గొన్నారు.

చైన్ స్నాచింగ్‌పై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: ఓ ఆగంతకుడు నడుచుకుంటూ వెళుతున్న మహిళ మెడలోని బంగారు గొలుసు తెంచుకుని పరారైన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. ఏటీఅగ్రహారం 7వ లైనులో నివసించే చిల్లర ఉష బ్రాడీపేటలోని శ్రీవెంకటేశ్వర బాలకుటీర్‌లో టీచర్‌గా పని చేస్తున్నారు. శనివారం సాయంత్రం పాఠశాల నుంచి ఇంటికి వెళుతున్నారు. అంకమ్మనగర్ కంకరగుంట సమీపంలో వెళుతుండగా ఓ ఆగంతకుడు నడుచుకుంటూ వచ్చి ఉష మెడలోని మూడు సవర్ల బంగారు గొలుసు తెంచుకుని పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళను వేధిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

మహిళను వేధించిన వ్యక్తిపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వసంతరాయపురానికి చెందిన వివాహిత పిల్లల్ని పాఠశాల వద్ద వదిలి వెళ్లివస్తున్న సమయంలో ఓ వ్యక్తి ఆమె వెంటపడి వేధిస్తున్నాడు. బాధితురాలు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

నేడు గోరంట్లలో మెగా ఉచిత వైద్య శిబిరం

గుంటూరు రూరల్: విజయశ్రీ క్లినిక్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు గోరంట్ల గ్రామంలోని తూర్పు బజారు నందన్న కమ్యూనిటీ హాల్‌లో మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు డాక్టర్ ప్రసన్నకుమార్, డాక్టర్ పృథ్వీకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీపీ, షుగర్, జ్వరాలు, దీర్ఘకాలిక వ్యాధులు, నొప్పులకు పరీక్షలు నిర్వహిస్తామని, మందులు పంపిణీ చేస్తామని తెలిపారు.

గాలికుంటు టీకాలు వేయించాలి

పెదకాకాని: పశు పోషకులు గాలి కుంటు వ్యాధి నివారణకు పశువులకు టీకాలు వేయించి, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పెదకాకాని పశు వైద్యాధికారి డాక్టర్ సుబ్బారెడ్డి అన్నారు. వెనిగండ్ల గ్రామంలో శనివారం గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుబ్బారెడ్డి మాట్లాడుతూ రైతులు తమ పశువులకు గాలికుంటు రాకుండా టీకాలు వేయించాలన్నారు. తొలిరోజు వెనిగండ్ల గ్రామంలో 455 పశువులకు టీకాలు వేయడం జరిగిందన్నారు.

రుణం ఇప్పిస్తామని.. ఖాతా ఖాళీ..

గుంటూరు ఈస్ట్: బ్యాంకు రుణం ఇప్పిస్తానని మోసం చేసి పెద్ద మొత్తంలో డబ్బులు డ్రా చేసిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దేవాపురం 2వ లైనులో నివసించే చప్పిడి చిన్నమ్మకు నగరంపాలెం ఎస్‌బీఐ బ్యాంకులో అకౌంట్ ఉంది. ఆమె ఫిబ్రవరి 9వ తేదీ బ్యాంకు వెళ్లగా బెంగుళూరుకు చెందిన షేక్ ఫాతిమాగా ఓ మహిళ పరిచయం చేసుకుంది. బ్యాంకులో రుణం ఇప్పిస్తానని మాయమాటలు చెప్పి చిన్నమ్మను నమ్మించింది. ఆమెతో రెండు కాగితాలపై సంతకాలు తీసుకుంది. రుణం డబ్బులు మనియార్డర్ చేస్తానని చెప్పింది. మార్చి 13న చిన్నమ్మ, ఆమె కోడలు బ్యాంకుకు వెళ్లి పెన్షన్ డ్రా చేసే క్రమంలో బ్యాలెన్స్ చూసుకోగా, రెండు విడతలుగా రూ. 4.35 లక్షలు విత్‌డ్రా అయినట్లు తెలిసింది. ఫాతిమా మోసం చేసి డబ్బులు డ్రా చేసినట్లు గుర్తించి శనివారం బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమంగా ఇంట్లోకి ప్రవేశించిన వ్యక్తిపై కేసు నమోదు

ఇల్లు ఖాళీ చేసి అనంతరం కొద్దిరోజుల తరువాత తాళాలు పగులగొట్టి అక్రమంగా లోపలకు ప్రవేశించిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. విద్యానగర్‌కు చెందిన ఓరుగంటి బ్రహ్మయ్యకు శ్రీనగర్‌లో ఇల్లు ఉంది. ఆ ఇంటిని శివరామకృష్ణకు అద్దెకు ఇచ్చాడు. గత నెల అద్దె చెల్లించకపోవడంతో శివరామకృష్ణను బ్రహ్మయ్య ఇల్లు ఖాళీ చేయించాడు. మార్చి 29న శివరామకృష్ణ తాళాలు పగులగొట్టి అక్రమంగా ఇంట్లోకి ప్రవేశించాడు. బాధితుడు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీతారాములకు విశేష పూజలు

పాత గుంటూరు: గుంటూరువారితోట రెండో లైనులో ఏర్పాటు చేసిన ప్రత్యేక మండపంలో ఈమని ఆంజనేయశర్మ ఆధ్వర్యంలో 39వ శ్రీరామ నవమి ఉత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా శ్రీ సీతారాములకు విశేష పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానంతో ఉత్సవాలు ముగిశాయి. కార్యక్రమాన్ని కొంజేటి ప్రసాద్, వేదాంతం శ్రీనివాస్, నంబూరు సుబ్బారావు, గోవర్ధన్ పర్యవేక్షించారు.